

VAARTHA- 2007 MAY 10TH

A LEADING TELUGU NEWS MAGAZINE DAILY.

CHELI COLUMN: 'CHELI' MEANS 'A FRIEND'.

THIS COLUMN HIGHLIGHTS ABOUT INNOVATIVE WORKS

AND CONTRIBUTIONS DONE IN AVRIOUS FIELDS BY WOMEN.

ABOUT MY PUPPETRY WORK AND WORK SHOPS

WERE INTERVIWED AND PUBLISHED.

COLUMN

②

చెలి

'చిన్నతనంలో మా అబ్బాయి కేవలం సీతాకోకచిలుకలను మాత్రమే గుర్తించగలిగేవాడు. అందుకే ఏ కథ చెప్పినా అందులో సంబంధమున్నా లేకపోయినా సీతాకోకచిలుకను చేర్చేదాన్ని. వాడికి ఆసక్తి కలిగించాలనే సీతాకోకచిలుక బొమ్మలు తయారుచేసి చేతులతో ఆడిస్తూ కథలు చెప్పేదాన్ని అలా మొదలయింది పప్పెట్‌లతో నా అనుబంధం' అంటూ మొదలెట్టారు పద్మిని రంగరాజన్. పప్పెట్స్(చేతులతో ఆడించే బొమ్మలు) ద్వారా రకరకాల సామాజిక సమస్యలమీద ముఖ్యంగా చిన్నపిల్లల్లో చదువుపై ఆసక్తిని కలిగించే పనిలో ఉన్నారామె.

కర్ణాటకకు చెందిన పద్మిని డిగ్రీ చదివే సమయంలో నర్మదా బచావో ఆందోళన ఉద్యమకారిణి మేధాపాట్కర్ స్ఫూర్తితో 'సోషల్ వర్క్'లో మాస్టర్ డిగ్రీచేసారు. దానితో పాటు తనకిష్టమైన సైకాలజీలోనూ మాస్టర్స్ చేసి సామాజిక సమస్యలపై పనిచేసే ఎన్‌జిఓల్లో చేరారు.

పెళ్లి తరువాత భర్త శ్రీనివాసన్ రఘు ఉద్యోగరీత్యా ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడ్డారు. ఇక్కడ ఖాళీగా ఉండడం ఇష్టంలేక తను నేర్చుకున్న చైనీస్, ఇంగ్లీషులను రామకృష్ణమఠ్ లోనూ, ఒక పత్రిక ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్‌ల్లోనూ ఫ్రీలాన్సర్‌గా బోధిస్తున్నారు.

మా అబ్బాయే నాకు 'స్ఫూర్తి'

పప్పెట్ షోలతో చైతన్యవ్యాప్తి

కొత్తరకంగా కథలు చెప్పాలన్న ఉత్సాహమే...

తన చిన్నతనంలో తల్లి ప్రోద్బలంతో నేర్చుకున్న సంగీతం, డ్రాయింగ్, నృత్యాలను రెండేళ్ల పిల్లవాడైన కొడుకు అనిరుధ్‌కు చెప్పే కథలకు జోడించి ఆసక్తిని పెంచేవారామె. అప్పటికే సాఫ్ట్‌టాయ్స్ తయారీలో కొంత ప్రవేశం ఉన్న పద్మిని ఆ బొమ్మలను కూడా చేతులతో ఆడిస్తూ కథలకు జీవాన్నిచ్చేవారు. దానికొరకు స్వయంగా ఇంట్లోని పనికిరాని వస్తువులతో బొమ్మలు తయారుచేసేవారు. బాబు స్కూలుకు వెళ్లడం మొదలయిన తరువాత స్కూల్లో నర్సరీ పిల్లలకు పప్పెట్రీ సహాయంతో బోధన చేస్తున్న క్రమంలో 'మా అమ్మకూడా ఇలాగే చేస్తుంది. మా ఇంట్లో కూడా బొమ్మలున్నాయి' అని టీచర్‌కు చెప్పడం, టీచర్ వెంటనే పద్మినికి కబురుపెట్టి, తమ స్కూల్లో పిల్లలకొరకు ఒక షో ఏర్పాటు చేయమని కోరడం వెంటవెంటనే జరిగిపోయాయి.

అలా తన కొడుకు ద్వారా [illegible] ఒక సీరియస్ కార్యక్రమానికి నాంది పలికిందని చెబుతారామె. అంతేకాదు మొదటిసారి తాను తయారుచేసిన 'మల్లు ద మంకీ' బొమ్మకు చెవులు పెట్టడం మరచిపోతే తన కొడుకే గుర్తించాడని, తరువాత స్కూల్లో ప్రోగ్రాంలిస్తున్న క్రమంలో ఎన్నో విషయాలు పిల్లల ద్వారా నేర్చుకున్నాననీ అంటారామె.

ప్రత్యేకంగా ఏమీ నేర్చుకోలేదు

ఈ బొమ్మల తయారీమీద ప్రత్యేకమైన కోర్సేమీ చేయలేదంటారు పద్మిని 'ఆంధ్రమహిళా సభలో నేర్పుతారంటే వెళ్లాను, కానీ అది నాకంత సంతృప్తినివ్వలేదు. మనమే ఇంట్లో చేయవచ్చు కదా అనుకున్నాను. వీటిని ఇలాగే తయారుచేయాలని ఏమైనా నిబంధనలున్నాయేమోనని కర్నాటకలో రేడియో, డ్రామా ఆర్టిస్టయిన మా నాన్నను అడిగాను. 'ఒక పేపర్‌ముక్కకు రెండు కళ్లు పెట్టి దానిని అటూ, ఇటూ ఊపుతూ చెప్పినా పప్పెట్రీనే అవుతుంది. ఎవరి సృజనాత్మకతను బట్టి వారు ఎన్ని రకాలైనా తయారుచేయవచ్చు' అని ప్రోత్సహిస్తూనే, చూసే/ప్రేక్షకులు ఎవరు, వారికి ఏం చెప్పాలనుకుంటున్నామో దాన్ని ఎలా చెప్పాలి, డైలాగ్స్ ఎలా ఉండాలి, స్క్రీన్ ప్లే... ఇలాంటి విషయాల్లో ఎన్నో సూచనలిచ్చారు. ఇక అంతే నా కొచ్చిన కళలన్నీ వీటికి అన్వయించాను. ఇప్పుడు 'స్ఫూర్తి థియేటర్ ఫర్ ఎడ్యుకేషనల్ పప్పెట్రీ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్' పెట్టి దాని ద్వారా ప్రోగ్రాంలు ఇస్తున్నాను' అని చెప్పుకొచ్చారామె.

అవగాహన, సందేశాలే ముఖ్యోద్దేశాలు

తన పప్పెట్రీ ద్వారా ఎక్కువగా పిల్లలకు రకరకాల విషయాల్లో అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నానంటారామె. వివిధ స్కూళ్లలో వారి కోరిక మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారి పాఠ్యాంశాల్లోని విషయాలు కానీ, నాలుగైదు పాఠాలు కలిపి ఒక గంట కార్యక్రమంలో చిన్నారి బుర్రల్లోకి పూర్తిగా ఇంకిపోయేలా చెప్పడం లేదా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వారికి అర్థమయ్యేలా 'హెల్త్ రిలేషన్స్'మీద మన సంప్రదాయాలు, పాశ్చాత్య నాగరికత ప్రభావాల మీద పప్పెట్స్ ద్వారా బోధిస్తారు. అలాగే ఇళ్లల్లో పనిచేసుకునే మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాలకార్మికులు... ఇలాంటి సామాజిక సమస్యలమీద కూడా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో కలిసి పనిచేస్తారామె. ముఖ్యంగా తన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో కాస్తయినా అవేర్‌నెస్ కొరకు ప్రయత్నిస్తానంటారామె. తనతోపాటు ఈ థియేటర్‌లో ఐశ్వర్య, శిరీష, పద్మజలు క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ఇక అత్తగారు సుభద్ర శ్రీనివాసన్ సహకారం మరువలేనిది అంటారామె. ఆమెకు నర్సింగ్ చేయాలన్న కోరిక ఉండేదట. కుదరలేదు కాబట్టి తాను ఇప్పుడు చేస్తున్న పనికి ఆమె ఎంతో సహకరిస్తారని చెప్పారామె.

ఎన్నిరకాలు

వీటిలో ఫింగర్ పప్పెట్స్, గ్లౌ పప్పెట్స్, షాడో పప్పెట్స్, రాడ్ పప్పెట్స్... ఇలా నానా రకాలుంటాయి. వీటన్నింటిని తన వీలును, అవసరాన్ని బట్టి ఉపయోగిస్తారామె. అలాగే ఇంటర్‌నెట్, పప్పెట్రీ థియేటర్స్ ప్రచురించిన పుస్తకాల ద్వారా పప్పెట్రీకి సంబంధించిన కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు. 'వీటి తయారీకి బాల్స్, గ్లాసులు, పాత్రలు, పేపర్‌గుజ్జు, కలర్స్, బట్టముక్కలే...ముడిపదార్థాలు. వీటికి తోడు తరిగిపోని సృజనాత్మకత ఉండనే ఉంది కదా' అంటూ ముగించారామె.

❑ సుమబాల

ఫొటోలు: విజయభాస్కర్

పిల్లలకు పప్పెట్రీలో శిక్షణనిస్తూ...